క్లుప్తంగా

గిరిజనుల వద్ద ప్రభుత్వమే జీడిపప్పు కొనుగోలు చేయాలి



సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న గిరిజనులు

రోలుగుంట: మండలం రత్నంపేట పంచాయతీ శివారు పనసలపాడు గ్రామంలో శుక్రవారం జీడి పప్పు ధర నిర్ణయించి, ప్రభుత్వమే విక్రయించాలనే డిమాండ్‌తో కూడిన కరపత్రాలతో గిరిజనులు సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అప్పులు చేసి పెట్టుబడి పెట్టినా గిట్టుబాటు ధర లేక పడుతున్న ఇక్కట్లు తెలిపారు. పెట్టుబడులకు తగ్గట్లు కిలో రూ. 200గా నిర్ణయించాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేసి సిండికేట్ల నుంచి కాపాడాలని కోరారు. సీపీఎం నాయకుడు ఇ.చిరంజీవి మాట్లాడుతూ జీడి పిక్కల పంట కోసం ప్రత్యేక కార్పొరేషన్, ప్రత్యేక నిధి ఏర్పాటు చేసి గిరిజనులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

శ్రీదేవి పెద్దింటమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రోలుగుంట: కుసుర్లపూడిలో శుక్రవారం శ్రీదేవి పెద్దింటమ్మ ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. పలు ప్రాంతాల నుండి భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ వర్గాలు ప్రత్యేక ఏర్పాటు చేశారు.

వేడుకగా నాగవల్లి సంబరాలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనారాయణ స్వామి

మాడుగుల రూరల్: మండలంలోని ఎం.కోడూరులో గల శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక కల్యాణోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం స్వామి వారికి స్థానిక తాచేరు నది తీరంలో నాగవల్లి సంబరం నిర్వహించారు. స్థానిక భక్తుడు యలమంచిలి కొండలరావు దంపతుల సారథ్యంలో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. శనివారం పవళింపు సేవ, ప్రత్యేక పూజలతో ఈ ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఆశ్రమంలో పౌర్ణమి పూజలు



పౌర్ణమి పూజల్లో పాల్గొన్న భక్తులు

నర్సీపట్నం: బలిఘట్టం ఉత్తర వాహినిలోని శ్రీ పాకలపాడు గురుదేవుల ఆశ్రమంలో శుక్రవారం పౌర్ణమి పూజలు నిర్వహించారు. నర్సీపట్నం పరిసర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

నవోదయంపై మైక్ ప్రచారం

మాకవరపాలెం: నాటుసారా రహిత గ్రామాలే లక్ష్యంగా శుక్రవారం మండలంలోని గిడుతూరు, మాకవరపాలెం, తామరం, నగరం, భీమబోయినపాలెం గ్రామాల్లో మైక్ ద్వారా ప్రచారం నిర్వహించారు. సారా తాగడం వల్ల కలిగే అనర్థాలపై ఎక్సైజ్ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించి, కరపత్రాలు పంపిణీ చేశారు. నాటు సారా విక్రయిస్తే కేసులు తప్పవని ఎక్సైజ్ సీఐ సునీల్‌కుమార్ హెచ్చరించారు.

ముగిసిన వెంకన్న కల్యాణోత్సవాలు

రోలుగుంట: స్థానిక కొండపైన వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో అయిదు రోజుల పాటు నిర్వహించిన వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ముగింపు రోజు స్వామి వారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. దీనిలో భాగంగా ఆలయ అర్చకుడు రేజేటి శ్రీనివాసాచార్యులు ఆలయంలో స్వామివారి పేరిట అభిషేకం చేశారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట

నాతవరం: కొత్త ఎల్లవరంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నదాన జరిగింది. ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు భక్తులు విచ్చేసారు. బాపన్నపేట గ్రామానికి చెందిన గుణం రామ్మకృష్ణ కుటుంబ సభ్యుల సహకారంతో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట జరిగింది.

అరకొర బస్సులు..



అంతులేని సమస్యలు

- తగినన్ని సర్వీసులు లేక మాడుగుల ప్రజల అవస్థలు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు, విద్యార్థులు
- తప్పని పరిస్థితిలో ప్రైవేట్ వాహనాలపై ప్రయాణం
- మధ్యాహ్నం వేళ ఒకేసారి వరుసగా బస్సుల రాక.. ప్రయాణికులు లేకపోయినా వెంటనే తిరుగు ప్రయాణం
- పల్లెవెలుగు బస్సుల కొరతతో దూర ప్రయాణికుల అవస్థలు



మాడుగుల నుంచి ఖాళీగా వెళ్తున్న మాడుగుల-అనకాపల్లి పల్లె వెలుగు బస్సు



బస్సులు లేక ఖాళీగా ఉన్న మాడుగుల బస్టాండు

మాడుగుల రూరల్: ఏజెన్సీ ముఖద్వారం అయిన మాడుగుల నియోజకవర్గానికి ప్రధాన కేంద్రమని చెప్పాలి. అయితే ఈ ప్రాంతానికి పూర్తి స్థాయిలో బస్సులు నడపకపోవడం వల్ల మాడుగులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆర్టీసీ అధికారుల ఉదాశీనత, సమయపాలన పాటించని బస్సుల వల్ల ప్రయాణం నరకంగా మారిందని వాపోతున్నారు. విశాఖ నుంచి నడిచే మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు, అనకాపల్లి నుంచి రాకపోకలు సాగించే పల్లె వెలుగు బస్సులు సకాలంలో రాక ప్రయాణికులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, వ్యాపారులు అవస్థ పడుతున్నారు. విధిలేని పరిస్థితిలో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించక తప్పటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.30 వరకు విశాఖ పరిధిలో గల వాల్తేరు, మద్దిలపాలెం, సింహాచలం డిపోలకు చెందిన మెట్రో ఎక్స్‌ప్రెస్, అనకాపల్లి డిపో నుంచి మాడుగులకు నడిచే పల్లె వెలుగు బస్సులు ఒక దాని వెనుక ఒకటి 16 వస్తాయి. వచ్చినవి వచ్చినట్లే వెళ్లిపోతాయి. దీంతో ఉద్యోగులు, వ్యాపారులు, తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సాయంత్రం 4.30 దాటితే మాత్రం మాడుగుల నుంచి నేరుగా విశాఖ వెళ్లడానికి బస్సులే ఉండటం లేదు. అలాగే సాయంత్రం 5.30 దాటిన తర్వాత మాడుగుల నుంచి అనకాపల్లి వెళ్లడానికి కూడా బస్సులు లేవు. పాడేరు నుంచి అనకాపల్లి వెళ్లే బస్సు సర్వీసులు ఘాట్‌రోడ్డు జంక్షన్ మీదుగా నడుపుతున్నారు. అలాగే మధ్యాహ్నం 3 గంటలు దాటితే విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి మాడుగుల కేంద్రానికి బస్సులు లేవు. అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి మాడుగుల రావడానికి సాయంత్రం 4.30 దాటితే బస్సు సౌకర్యం లేదు. చోడవరం వరకు బస్సు మీద ప్రయాణం చేసి, అక్కడి నుంచి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించక తప్పడం లేదు. అనకాపల్లిలో రాత్రి 9.30కు మాడుగుల నైట్ హాల్ట్ బస్సు ఉంది. ఈ బస్సు మాడుగుల చేరుకునే సరికి రాత్రి 11 దాటుతుంది.

పలు సర్వీసులు రద్దు..

15 సంవత్సరాలుగా ఘాట్‌రోడ్డు జంక్షన్ మీదుగా నడుస్తున్న పాడేరు డిపో బస్సులు మాడుగుల మీదుగా కాకుండా ఘాట్‌రోడ్డు జంక్షన్ మీదుగా నడుపుతున్నారు. దీంతో మండల కేంద్రానికి వచ్చేవారు ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో దిగి మాడుగుల రావాల్సి వస్తుంది. నర్సీపట్నం నుంచి కింతలి మీదుగా మాడుగుల వరకు నడిచే పల్లె వెలుగు బస్సు సర్వీసును రద్దు చేశారు. దీంతో సుమారు 20 గ్రామాలకు చెందిన మాడుగుల డిగ్రీ, జూనియర్ కళాశాలల విద్యార్థులకు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించక తప్పడంలేదు. అలాగే మాడుగుల నుంచి నేరుగా సింహాచలం కొండ మీదకు నడిచే ఆర్టీసీ సర్వీసును అధికారులు గతంలో ప్రారంభించి.. రెండు మాసాల తర్వాత అర్థాంతరంగా రద్దు చేశారు. ఇక పోతే మాడుగులకు గతంలో నాలుగైదు నైట్ హాల్ట్ బస్సులు నడిపేవారు. ఇప్పుడు విశాఖకు రెండు, అనకాపల్లికి ఒక బస్సు మాత్రమే ఉన్నాయి. గతంలో పాడేరు నుంచి శ్రీకాకుళం, విజయనగరానికి మాడుగుల మీదుగా బస్సులు నడిపేవారు. వీటిని కూడా రద్దు చేశారు. మాడుగుల నుంచి సాగరం చేరుకునేందుకు గత ప్రభుత్వ హయాంలో వేసిన బ్రిడ్జి నిర్మాణం పూర్తయింది. సుమారు రూ. 4 కోట్ల వ్యయంతో దీనిని నిర్మించారు. ఈ రహదారి మీదుగా విశాఖ–పాడేరు బస్సులు నడపాలని స్థానికులు కోరుతున్నా ఎవరూ పట్టించుకోలేదు.



నిరుపయోగంగా ఉన్న మాడుగుల ఆర్టీసీ కాంప్లెక్స్

ఎన్నో సమస్యలు..

లక్షల వ్యయంతో నిర్మించిన మాడుగుల ఆర్టీసీ కాంప్లెక్స్ తుప్పలు, డొంకలతో నిరుపయోగంగా తయారై అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఇక్కడ బస్సు వేళలు తెలిపేందుకు ఆర్టీసీ కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేయలేదు. మెట్రో, పల్లెవెలుగు బస్సులు ఒకేసారి ఒకదాని వెనుక ఒకటి వచ్చి కొంచెం సేపు కూడా నిలబడకుండా వెళ్లిపోవడం వల్ల ప్రజలు అవస్థ పడుతున్నారు. మాడుగులలో ప్రతి సోమ, గురువారాల్లో వారపు సంతలు జరుగుతాయి. ఈ సంతలకు గిరి రైతులు తాము పండించిన ఫలసాయాన్ని విక్రయించేందుకు తీసుకొస్తారు. వీటిని కొనుగోలు చేసేందుకు విశాఖ, అనకాపల్లి, తుని, నర్సీపట్నం తదితర దూర ప్రాంతాల నుంచి వ్యాపారులు వస్తారు. సమయపాలన పాటించని బస్ సర్వీసుల వల్ల అటు గిరి రైతులు, వ్యాపారులు ఇక్కట్లు పడుతున్నారు.

మరిన్ని సర్వీసులు నడపాలి..



సాయంత్రం 5 దాటితే చోడవరం, అనకాపల్లి, విశాఖ వెళ్లడానికి బస్సు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నాం. రాత్రి 10 వరకు మాడుగుల నుంచి చోడవరం, అనకాపల్లి, విశాఖ వంటి దూర ప్రాంతాలకు వెళ్లడానికి బస్సు సర్వీసులు పెంచాలి. ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థుల సౌకర్యార్థం అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పుట్టా బలరామ్, వ్యాపారి, మాడుగుల గ్రామం.

బస్సులు లేక ఇక్కట్లు..



విశాఖ, అనకాపల్లి నుండి వచ్చే బస్సులను కోనాం మీదుగా పాడేరు వరకు నడపాలి. గిరిజనుల ఫలసాయాన్ని మాడుగుల, పాడేరు తదితర వారపు సంతలకు తరలించడానికి అనువుగా బస్సులు నడపాలి. అలాగే మాడుగుల నుంచి నైట్ హాల్ట్ సర్వీసులు పెంచాలి. ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులకు అనువుగా సర్వీసులు నడపాలి.

– మాదెల గురుమూర్తి, ప్రయాణికుడు, కుమ్మరిపాలెం గ్రామం

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

కె.కోటపాడు: కింతాడ పంచాయతీ జోగన్నపాలెం నివాసి బండారు లక్ష్మి ఇంట్లో శుక్రవారం ఉదయం షార్ట్ సర్క్యూట్ అయి ఫ్రిజ్, గ్రైండర్, ఫ్యాన్‌లు, చీరలు దగ్ధమయ్యాయి. షార్ట్ సర్క్యూట్ సమయంలో భయంతో బయటికి పరుగులు తీశామని ఆమె తెలిపారు. సర్వస్వం కాలిపోవడంతో కట్టుబట్టలతో మిగిలినట్లు పేర్కొంది. లక్ష్మి ఇంటిని స్థానిక సర్పంచ్, ఉప సర్పంచ్ బండారు ఈశ్వరమ్మ, ముత్యాలనాయుడు పరామర్శించి ఆమెను ఓదార్చారు. జరిగిన ఘటనను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాయపడాలని కోరనున్నట్లు ఆమెకు సర్పంచ్ ఈశ్వరమ్మ తెలిపారు.

ఘనంగా అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం

కె.కోటపాడు: పైడంపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన మోదకొండమ్మ అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన జరిపారు. స్థానిక సర్పంచ్ రొంగలి రాఘవనాయుడు, రొంగలి రమేష్ అమ్మవారిని దర్శించుకున్నారు.

21న గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వద్ద మహాధర్నా

చోడవరం: చెరకు రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 21వ తేదీన గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వద్ద మహాధర్నా నిర్వహించేందుకు ఏపీ రైతు సంఘం, వ్యవసాయ కూలీ, కార్మిక సంఘాలు, సీపీఎం, సీఐటీయూ అఖిల పక్ష సమావేశం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో చోడవరం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, చెరకు రైతుల సమస్యలను పట్టించుకోకపోవడంతో ఫ్యాక్టరీ, రైతుల సమస్యలు తెలిపేందుకు ఈనెల 21న ఫ్యాక్టరీ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నామని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు చెప్పారు. ఈ మహాధర్నా ద్వారా ప్రభుత్వానికి, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలకు కళ్లు తెరిపించాలని రైతు సంఘం నాయకులు అన్నారు. రైతు సంఘం ఉపాధ్యక్షుడు ఎస్వీ నాయుడు, సీపీఎం, సీఐటీయూ నాయకులు నాయిని బాబు పాల్గొన్నారు.

రంగుల కేళీ.. హోలీ



దేవరాపల్లిలో రంగులు పూసుకుంటూ సందడి చేస్తున్న చిన్నారులు



నర్సీపట్నం ఎన్టీఆర్ స్టేడియంలో బాలబాలికల హోలీ సంబరాలు

నర్సీపట్నం: ఎన్టీఆర్ స్టేడియంలో స్పోర్ట్స్ స్టూడెంట్లు హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. బాల, బాలికలతో పాటు వాకర్లు, బాక్సింగ్, కరాటే, వుషు క్రీడాకారులు వేడుకల్లో మునిగి తేలారు. నింజాస్ అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు అందరికీ రంగులతో పాటు స్వీట్లు పంచిపెట్టారు.

ఉల్లాసంగా హోలీ వేడుకలు..

కె.కోటపాడు: మండలంలో పాతవలస, ఎ.కోడూరు, కె.కోటపాడు, ఆనందపురం, చౌడువాడ, ఎ.భీమవరం గ్రామాల్లో యువకులు ఆనందోత్సాహాలతో హోలీ నిర్వహించుకున్నారు.



మాడుగులలో హోలీ సంబరాల్లో పాల్గొన్న చిన్నారులు

గ్రామాల్లో ఘనంగా హోలీ సంబరాలు..

మాడుగుల రూరల్: గ్రామాల్లో శుక్రవారం పాఠశాల విద్యార్థులు రంగులు చల్లుకుని హోలీ వేడుక జరుపుకున్నారు. వీధుల్లో కలియదిరుగుతు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు.

చిన్నాపెద్దా హోలీ సందడి..

దేవరాపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో హోలీ వేడుకను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా రంగులు పూసుకుంటూ సందడి చేశారు. పాఠశాలలకు సెలవు కావడంతో చిన్నారులు సైతం ఒకరికొకరు రంగులు రాసుకుంటూ, ఉల్లాసంగా గడిపారు.

సందడిగా హోలీ వేడుకలు..

మాకవరపాలెం: గ్రామాల్లో యువకులు, చిన్నారులు హోలీ వేడుక జరుపుకున్నారు. ఆన్‌రాక్ రిఫైనరీలోని కార్మికులతో పాటు అవంతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు.



మాకవరపాలెంలో హోలీ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు



కె.కోటపాడులో హోలీ వేడుకల్లో చిన్నారులు

మాడుగుల పట్టణంలో..

మాడుగుల: పట్టణంలో హోలీ సంబరాలు శుక్రవారం ఆనందంగా జరుపుకున్నారు. చిన్నారులు రంగు నీళ్లు జల్లుకుని కేరింతలు కొట్టారు. పుట్టా రోహిత్, లాస్యశ్రీ, దిమిలా హర్ష, భాస్కర్, గ్రామస్తులు రంగులు చల్లుకుని సంబరాలు జరిపారు.

విద్యార్థులకు పరీక్షల సామగ్రి అందజేత



చౌడువాడ హైస్కూల్ విద్యార్థులకు పరీక్షల సామగ్రి అందిస్తున్న శివాజీరాజు, గంగాధర్ తదితరులు



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు తదితరులు

కె.కోటపాడు: విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు సత్యనారాయణ 14వ సంస్మరణను పురస్కరించుకుని శుక్రవారం ఆయన కుమారులు, ప్రస్తుత విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్, మహేష్, శివ 100 మంది చౌడువాడ హైస్కూల్ టెన్త్ విద్యార్థులకు అట్టలు, పెన్నులు, వాటర్ బాటిళ్లు, పెన్సిళ్లు, కాంపస్ బాక్స్‌లు అందించారు. దాతలు అందించే పరీక్షల సామగ్రి ఉపయోగించుకుని విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు అన్నారు. సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, వారాధి అప్పారావు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు ఏటుకూరి రాజేష్, మాజీ గోవాడ సుగర్ ఫ్యాక్టరీ డైరెక్టర్ రాజి శ్రీనివాసరావు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు ఆకుల సాయి ప్రసాద్, రాజి మోదినాయుడు, చల్లా సురేష్, పాల సంఘం అధ్యక్షుడు కోమార వెంకటరమణ, కోమార ఎర్రునాయుడు, కోమార ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ ఫోల్డర్ల పంపిణీ..

చీడికాడ: మండలంలోని ఖండివరం ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు రిటైర్డ్ వైస్ చాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు ఆర్థిక సాయంతో సమకూర్చిన సర్టిఫికెట్ ఫోల్డర్లను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అందించారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, ఎంఈవోలు బొంజుబాబు, బి.వి.రమణ, ఎంపీడీవో హేమసుందరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి



బోల్తా పడిన ట్రాక్టర్

నాతవరం: ప్రమాదశావత్తు ట్రాక్టర్ బోల్తా పడి సంఘటనా స్థలంలోనే డ్రైవర్ మరణించాడు. నాతవరం ఎస్ఐ సీహెచ్ భీమరాజు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లా కోటనందూరు మండలం అల్లిపూడి గ్రామానికి చెందిన పెదపాత్రుని సత్యనారాయణ (59) శుక్రవారం సాయంత్రం తన గ్రామం నుంచి వరి గడ్డి ట్రాక్టరుపై నాతవరం మండలం గుమ్మడిగొండ పంచాయతీ శివారు చిక్కుడుపాలెం గ్రామానికి వచ్చాడు. ఈ గ్రామంలో వరి గడ్డి అన్‌లోడ్ చేసి తిరిగి స్వగ్రామం అల్లిపూడి ట్రాక్టరుపై వెళ్లిపోతున్నాడు. చిక్కుడుపాలెం గ్రామ సమీపంలో రోడ్డు మలుపు వద్ద అదుపు తప్పి ట్రాక్టరు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో సత్యనారాయణ సంఘటనా స్థలంలోనే మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. పిల్లలు చదువుకుంటున్నారు. ఇంకా వివాహం కాలేదు. కుటుంబాన్ని పోషించే పెద్ద దిక్కును కోల్పోవడంతో భార్యాపిల్లలు బోరున విలపిస్తున్నారు. మృతుడి కుమార్తె నాగమణి ఫిర్యాదు మేరకు నాతవరం ఎస్ఐ సీహెచ్ భీమరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఉద్యోగ అవకాశాలపై హ్యూమన్ రీసోర్స్ కార్యక్రమం

మాకవరపాలెం: ఉద్యోగ అవకాశాలపై ఇంజినీరింగ్ విద్యార్థులకు హ్యూమన్ రీసోర్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అవంతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు తెలిపారు. ఇండస్ట్రీ కనెక్ట్ పేరుతో శనివారం ధర్మసాగరం వద్ద గల స్టార్ హోమ్స్‌లో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని, విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రముఖ పరిశ్రమల కార్యదర్శులు హాజరై విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పిస్తారన్నారు.

తక్షణమే బకాయిలు చెల్లించాలి



కూలీలతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు రాజు, ప్రసన్న

నర్సీపట్నం: ఉపాధి కూలీల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. రావణాపల్లి రిజర్వాయర్‌లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సీఐటీయూ బృందం పరిశీలించి కూలీల ఇబ్బందులను అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఆరు వారాలుగా కూలీ డబ్బులు చెల్లించకపోతే వారు ఏ విధంగా జీవనం సాగిస్తారని ప్రశ్నించారు. ఉపాధి హామీని నిర్వీర్యం చేయడమే బీజేపీ లక్ష్యమన్నారు. వేసవి ప్రారంభమైనా పని ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేయలేదన్నారు. రవాణా, మంచినీటి సౌకర్యం కల్పించలేదన్నారు. సక్రమంగా పనిదినాలు కల్పించటంలో అధికారులు విఫలమవుతున్నారన్నారు. రోజువారి కూలీ రూ.600కు పెంచి, 200 పని దినాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కె.ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఈ-శ్రమ్ కార్డుల అందజేత



మహిళా కార్మికులకు కార్డులందిస్తున్న దృశ్యం

చీడికాడ: మండలంలోని శిరిజాం శివారు ఎల్ఎన్ పురంలో గల జయశ్రీ పవర్‌లూమ్ ఇండస్ట్రీలో పని చేస్తున్న 30 మంది మహిళా కార్మికులకు చోడవరం సహాయ కార్మిక అధికారి పి.సూర్యనారాయణ ఈ-శ్రమ్ కార్డులు అందించారు. ప్రతి కార్మికుడు ఈ-శ్రమ కార్డులు తీసుకోవాలని ఆయన అన్నారు. వాటి ద్వారా రూ. 2 లక్షల వరకు ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ఈ కార్డులు కావల్సిన వారు సచివాలయంలో గాని మీ-సేవ ద్వారా కాని పొందవచ్చన్నారు. మాజీ ఎంపీపీ పాత్రిని రాముడమ్మ, మాజీ జెడ్పీటీసీ పోతల రమణమ్మ, ఇండస్ట్రీ చైర్‌పర్సన్ భూసాల సుజాత, స్వాతి మ్యాక్స్ సిబ్బంది దారపు లక్ష్మి, సేవా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి హత్య కేసులో నిందితుడి అరెస్టు



మాట్లాడుతున్న సీఐ అప్పలరాజు

చోడవరం: తీవ్రంగా గాయపరిచి వృద్ధుడి మృతికి కారకుడైన నిందితుడు నేమాల హరిని అరెస్టు చేసినట్టు చోడవరం సీఐ అప్పలరాజు శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈనెల 4వ తేదీన చోడవరం బాలాజీనగర్‌కు చెందిన ఇందల సన్యాసిరావు అనే వృద్ధుడితో బానీకోనేరుకు చెందిన నేమాల హరి ఘర్షణ పడి తీవ్రంగా కొట్టి గాయపరిచాడు. సన్యాసిరావు తలకు బలమైన గాయమై విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 12వ తేదీన మృతి చెందాడని సీఐ చెప్పారు. నిందితుడు హరిని చోడవరం ఐటీఐ కాలనీ సమీపంలో అరెస్టు చేసి కోర్టుకు తరలించామని సీఐ తెలిపారు. నిందితుడికి కోర్టు రిమాండ్ విధించిందని ఆయన పేర్కొన్నారు.

రహదారి సమస్యకు ఎట్టకేలకు మోక్షం



రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న చింతలపూడి సర్పంచ్ బోడెమ్మ తదితరులు

దేవరాపల్లి: మండలంలోని చింతలపూడి పంచాయతీ శివారు వీరభద్రపేట రహదారి సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించింది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మీకో దండం.. మా గ్రామానికి రోడ్డు వేయండంటూ మోకాళ్లపై నిల్చొని వినూత్న రీతిలో గిరిజనులు ఈ నెల 3న ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి రూ. 84 లక్షల ఉపాధి హామీ నిధులు మంజూరు చేసింది. దీంతో సర్పంచ్ దొమ్మంగి బోడెమ్మ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. చిటిమిరెడ్డి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా



డిపో గేటు వద్ద ప్లకార్డులతో ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

నర్సీపట్నం: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ డిపోకు చెందిన ఎన్ఎంయూఏ ఉద్యోగులు భోజన విరామ సమయంలో డిపో గేటు వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఆర్.ఎస్.రాజు, డిపో ప్రెసిడెంట్ శంకర్రావు, కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ సస్పెండ్ చేసిన ఉద్యోగులను విధుల్లో తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని డిపోల సమస్యలపై డీపీటీవో మొండి వైఖరి విడనాలన్నారు. మహిళా కార్యకర్తలు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.